క్లుప్తంగా

నేడు పాఠశాలల్లో విద్యాంజలి – ఎంఈవో సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో నేడు విద్యాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సీహెచ్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి దాతల స్వచ్ఛంద సేవలు వినియోగించుకోవడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సేవలను ధన రూపంలో కాకుండా మౌలిక సదుపాయాల కల్పన రూపంలో అందించేలా హెచ్ఎంలు చూడాలన్నారు. పాఠశాలలకు తాగునీరు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, తరగతి గదులు, మధ్యాహ్న భోజన వస్తువులు, విద్యార్థులకు నృత్యం, సంగీతం, సెల్ఫ్ డిఫెన్స్.. వంటి ప్రత్యేక శిక్షణతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఆట సామగ్రి, లైబ్రరీ పుస్తకాలను సరఫరా చేయవచ్చని చెప్పారు. దాతలు చేసే ఏ సహాయమైనా సేవల రూపంలో మాత్రమే అందించాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద కార్యక్రమాల్లో స్థానికంగా ఉన్న ఎన్జీవోలు, ఎన్నారైలు గానీ వ్యక్తిగతంగా సేవ అందించాలకునే ప్రతి ఒక్కరు పాఠశాలలో వలంటీర్లుగా నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవలు అందించాలని ఎంఈవో కోరారు.

వాసవీ మాతకు సారె సమర్పణ



నగరంపాలెం: స్థానిక ఏటుకూరు రోడ్డు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్, వాసవీ జాగృతి క్లబ్ గర్తపురి సంయుక్తంగా వాసవీ అమ్మ వారికి సారే మనసారా కార్యక్రమం నిర్వహించారు. వాసవీ మాతకు పసుపుకుంకుమ, చీర, పుష్పాలను భక్తితో సమర్పించారు. కార్యక్రమంలో యేలూరి హాస్పిటల్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మానస, వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ మాస్టర్ కార్డ్ ఇన్చార్జి రంగా రత్నశ్రీ , వనిత జాగృతి క్లబ్ గర్తపురి బృందం రంగా చంద్రశేఖర్, మద్ది రాకేష్, వాసవి పాల్గొన్నారు.

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుప్రసిద్ధ గాయకులు జి.అభిరామ బోడె శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. శ్రీ త్యాగరాజస్వామితో పాటు పలు వాగ్గేయకారుల కీర్తనల్ని మధురంగా గానం చేశారు. వయోలిన్పై గాయత్రీ విభావరి(చెన్నై) మృదంగంపై పి.ఎస్.ఫల్గున్ (విజయవాడ) చక్కటి వాయి ద్యాన్ని అందించారు. కార్యక్రమాన్నిసంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిశోర్ నిర్వహించారు. కళాకారుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేతనాల్లో టీడీఎస్ మినహాయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్, అర్బన్ మండలాల ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించి మొదటి, రెండవ క్వార్టర్లను టీడీఎస్ చేయకుండా ఉపాధ్యాయుల్ని ఎంఈవోలు ఆందోళనకు గురి చేస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్య, ప్రధాన కార్యదర్శులు డి.పెద బాబు, డి.కె. సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీఎస్ డిడక్షన్ ఈనెల 31లోపు పూర్తి చేసి, ఈ-ఫైలింగ్ పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే ముందస్తుగా టాక్స్ చెల్లించిన ఉపాధ్యాయుల టీడీఎస్ పూర్తి చేయకపోతే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల వేతనం నుంచి మినహాయించిన మొత్తం ఆన్లైన్లో కనిపించకపోవడంతో ఈ-ఫైలింగ్ చేసేందుకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. గుంటూరు రూరల్, అర్బన్ మండలాల పరిధిలోని ఎంఈవోలు తక్షణమే ఆడిటర్తో టీడీఎస్ పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్: జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం... ఓ వ్యక్తి బైకుపై విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్తున్న సమయంలో డీజీపీ కార్యాలయం సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తాడేపల్లి పోలీసులు వచ్చి ఆ వ్యక్తి (40)దుగ్గిరాలకు చెందిన వాడిగా మాత్రమే గుర్తించారు. వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

పుస్తకం లేని పాఠం

- ప్లస్ టూ తరగతుల్లో పాఠ్యపుస్తకాలు మైనస్
- ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సరఫరా చెయ్యని ప్రభుత్వం
- స్కూల్ బ్యాగ్, నోట్బుక్స్ ఇచ్చి సరిపెట్టిన సర్కారు
- గత్యంతరం లేక మెటీరియల్స్ కొనుక్కుని చదువుకుంటున్న విద్యార్థులు
- ప్రభుత్వ ప్లస్ టూ పాఠశాలల్లో దుస్థితి



పాఠ్య పుస్తకాల్లేకుండానే విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్లస్ టూ తరగతులపై నిర్లక్ష్యం చూపుతుంది. వారికి సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు ఏ పాఠంలోనివో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాల (ప్లస్ టూ)లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు సుమారు 31 మంది చదువుతున్నారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థులు 3, బైపీసీ 16



సరఫరా చేసిన బ్యాగు, నోట్బుక్స్



సింత మెటీరియల్స్తో చుదువుకుంటున్న విద్యార్థులు

మంది, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ 6, బైపీసీ 6 మంది ఉన్నారు. గత ప్రభుత్వం అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించింది. దీంతో పాఠశాలలో గణితం, ఇంగ్లిష్, తెలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ఉపాధ్యాయులున్నారు.

పుస్తకాలు నిల్..

ప్లస్ టూ తరగతులు బోధించేందుకు ఉపాధ్యాయులు ఫుల్గా ఉన్నా పాఠ్యపుస్తకాలు మాత్రం నిల్. ఈ ఏడాది ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం అందించలేదు. ఇటీవల ఒక బ్యాగు, పన్నెండు నోట్బుక్స్ అందించారు. నలభై రోజులు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాల ఊసే లేకపోయింది. బహిరంగ మార్కెట్లో పాఠ్యపుస్తకాల ధరలు చుక్కలనంటు తుండటంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యార్థులు స్టడీ మెటీరియల్స్ కొనుగోలు చేసుకుని పాఠాలు నేర్చుకోవలసిన దుస్థితి చోటుచేసుకుంది.

త్వరలో వస్తాయి

పాఠ్య పుస్తకాలు త్వరలోనే వస్తాయి. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఆయా సబ్జెక్టులను బోధిస్తున్నాం. ఇప్పటికే బ్యాగులు, నోట్బుక్స్ ప్రభుత్వం సరఫరా చేసింది. మరికొద్ది రోజుల్లో పాఠ్యపుస్తకాలూ రానున్నాయి.
– బి.బాలకోటయ్య, గణిత ఉపాధ్యాయుడు, ప్లస్ టూ పాఠశాల, ప్రత్తిపాడు

నాటి విద్యార్థులు.. నేటి స్నేహితులు



నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

గుంటూరు రూరల్: అలనాటి తీపి జ్ఞాపకాలు, ఆ పాత మధురాలను నెమరు వేసుకుంటూ గడచిన కాలాన్ని గుర్తు చేసుకుంటూ నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో 25 సంవత్సరాల వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. మధుర స్మృతులతో అలనాటి జ్ఞాపకాల కోసం మరలా ఒకరోజు అంటూ సాగిన వేడుకలు నాటి విద్యార్థులు.. నేటి స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో మొదలై ఆటపాటలతో సాగాయి. నాటి ఉపాధ్యాయులకు ఒకరినొకరు పరిచయాలు చేసుకుంటూ నేడు తమ స్థితిగతులు, పరిస్థితులను వివరించుకున్నారు. నాటి చిలిపి చేష్టలు, అధ్యాపకులతో తిన్న తిట్లు, పొందిన మెప్పులు నెమరువేసుకున్నారు. 25 సంవత్సరాల వేడుకల్లో భాగంగా నాడు తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి నేడు అభివృద్ధి చెందిన వైనాన్ని చర్చించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా చేయూతను అందించాలని నిర్ణయించుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల ఉన్నతికి తమవంతు కృషిచేస్తామని ఉపాధ్యాయులకు హామీలిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పాటలు, ఆటల పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా ఇదేవిధంగా అందరూ కలిసి వేడుకలు జరుపుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అనుకున్నారు.

ఘనంగా లావు రత్తయ్య జన్మదిన వేడుకలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో చైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చైర్మన్ రత్తయ్య మాట్లాడుతూ సాధారణ ఆలోచనలతో కాకుండా క్రియేటివ్గా ఆలోచిస్తేనే విజయం సాధించగలరని విద్యార్థులకు సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోనే విద్యార్థులు సరైన దిశగా ఎదగలరనే సిద్ధాంతాన్ని తాను మొదటి నుంచి నమ్ముతున్నానని చెప్పారు. జీవితంలో ఎవరైనా ఉన్నత స్థాయికి చేరాలంటే వారు ఎదుర్కొనే కష్టాలు, చేసే త్యాగాలను బట్టే ఫలితం లభిస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్ బి.రుద్రమదేవి, వైస్ చాన్స్లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

విజ్ఞాన్ విద్యార్థుల అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులతో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం సందడిగా ఉత్సాహంగా జరిగింది. 1997 నుంచి 2023 విద్యా సంవత్సరంకు చెందిన 26 బ్యాచెస్ విద్యార్థులు విజ్ఞాన్లో కలిసారు. రెండున్నర దశాబ్దాల అనంతరం కలిసిన వారంతా సందడిగా, సరదాగా, హుషారుగా గడిపారు. అలనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కలుసుకున్నారు. ఎవరెక్కడ స్థిర పడ్డారో తెలియజేయడంతో పాటు మిత్రులందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. యూనివర్సిటీలో చదివిన రోజులను గుర్తు చేసుకుని కొత్త అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ జీవితంలో మీరందరూ వృత్తిపరంగా ఉన్నత స్థానాల్లో స్థిరపడినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు మరిన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎవరైనా బీటెక్తోనే ఆగిపోయుంటే మాస్టర్స్, పీహెచ్డీ చేయాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్లర్ పి.నాగభూషణం, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చిక్కులు.. ప్రజల ఇక్కట్లు




ఎస్బీబీ రోడ్డులో ట్రాఫిక్లో నిలిచిన వాహనాలు

పొన్నూరు: ఇరుకైన రోడ్లు.. ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలు.. వెరసి పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నడిచేందుకు దారి లేక ట్రాఫిక్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొన్నూరులోని ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. ఎస్బీబీ రోడ్డు, రేపల్లె బస్ స్టాప్ వద్ద, కసుకర్రు రోడ్డు, గుంటూరు బస్ స్టాప్ తదితర చోట్ల ట్రాఫిక్తో ఇబ్బంది ఎక్కువగా ఉంటోంది. ఇరుకైన రోడ్డులో ఆటోలు ఎదురెదురుగా వచ్చిన ప్రతిసారి వాహనాల రాకపోకలకు ఆటంకం తప్పడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వ్యాపార కూడలి అయిన ఐలాండ్ సెంటర్లోని ప్రధాన వీధుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. సాయంత్రం వేళల్లో రోడ్లపైనే తోపుడు బండ్లు నిలిపి పండ్ల వ్యాపారాలు జరుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. ఎస్బీబీ రోడ్డులో థియేటర్ల వరకు వెళ్లాలంటే ట్రాఫిక్లో ఇరుక్కుపోవాల్సిందే. పల్లె ప్రాంతాల నుంచి వివిధ పనులపై జనం ఎక్కువగా వస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఈ దుస్థితి కనిపిస్తోంది. అధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



శివయ్య (ఫైల్)

ప్రత్తిపాడు: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన ధూపాటి శివయ్య (56) గత సంవత్సరం నాలుగు ఎకరాలు పొలం కౌలుకి తీసుకొని.. రెండు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసాడు. పంట సరిగా పండక పోవడంతో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాక నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీంతో రూ.4 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక మానసికంగా బాధపడుతున్నాడు. ఈ నెల 27వ తేదీ ఇంట్లో నోవాక్రాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య ధూపాటి ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపారు.

రక్తదానంపై అపోహల్ని వీడాలి



రక్తదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు, యువత

నగరంపాలెం: రక్తదానంపై అపోహల్ని వీడి, ప్రతి ఒక్కరూ తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయాలని ఇన్నర్వీల్ క్లబ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షురాలు కంతేటి సంధ్యారాణి కోరారు. క్లబ్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల సహాయార్థం భారత్పేట మదర్థెరీసా భవన్లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు సంధ్యారాణి మాట్లాడుతూ సకాలంలో రక్తం లభించకపోవడంతో ఎందరో చనిపోతున్నారని అన్నారు. ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్లబ్ తరఫున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నీడ్స్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సాంబశివా రెడ్డి మాట్లాడుతూ తలసేమియా బాధితులకు పదిహేను రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, దాతలు ఎక్కువ మంది స్పందించాలని ఆయన కోరారు. క్లబ్ ప్రతినిధులు, యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.భవాని, మెంబర్ ఫ్యామిలీ ఎడిటర్ అనూరాధ, గుంటూరు ఇన్నర్వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు మట్టుపల్లి సునీత పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితాచౌదరి

ప్రత్తిపాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.హరితాచౌదరి అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గుంటూరు శ్రీ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 104 మంది రోగులు హాజరయ్యారు. వీరికి న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆరెకపూడి హరితాచౌదరి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. తొలుత రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన వైద్యం తీసుకుని ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపవచ్చని చెప్పారు. శిబిరంలో డాక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరితా చౌదరి

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తి అవసరం

లక్ష్మీపురం: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తి అవసరమని, తల్లిదండ్రులు కూడా చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయాలని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.కాశీనాథ రెడ్డి తెలిపారు. స్థానిక విద్యానగర్లోని స్టెమ్ పాఠశాలలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛాంపియన్ షిప్–2024 పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, పెదనందిపాడు ఎమ్మార్వో కేదార్నాథ్ హాజరై ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా నిర్వహించారు. పోటీల్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన క్రీడాకారులు ఆగస్టు 2న అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ రమణ, వలి, సాయి, విజయ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, తహసీల్దార్, అసోసియేషన్ అధ్యక్షుడు

భూమి పరిరక్షణ అందరి కర్తవ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వంలో మానవజాతి మనుగడకు అనువుగా ఉన్న ఏకైక గ్రహమైన భూమిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర పన్నుల శాఖ విశ్రాంత సూపరింటెండెంట్, ప్రకృతి ఛాయాచిత్రకారుడు డాక్టర్ టి.ఎస్. వరప్రసాద్ పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ – స్టెప్, స్వశక్తి ఆధ్వర్యంలో ఆదివారం జేకేసీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక, హరిత విప్లవం ద్వారా ప్రకృతికి జరిగిన నష్టాన్ని వివరించారు. పెరుగుతున్న పారిశ్రామీకరణ, పట్టణీకరణ ప్రభావం ప్రకృతి వనరులపై పడి, సహజ వనరులతో పాటు పచ్చదనం తరిగి పోతున్నాయని తెలిపారు. ప్రకృతి పరిరక్షణకు యువతరం నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త డి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సమస్త విశ్వంలోని సర్వజీవులు జీవించేందుకు కావాల్సిన సమతుల్యత లోపించిన కారణంగా మానవజాతి మనుగడకే ముప్పు ఏర్పడిన నేపథ్యంలో బయోస్పియర్ ప్రాధాన్యత, దాని లోటును భర్తీ చేసేందుకు యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్టెప్ మేనేజర్ బి. రాధిక మాట్లాడుతూ మన రాష్ట్రంలో 18 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని జాతీయ అటవీ విధానానికి అనుగుణంగా 33 శాతానికి పెంచేందుకు యువతరం ముందుకు రావాలని కోరారు. అనంతరం ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి. రాహుల్, కె. చరణ్చౌదరి, ఎల్. అజయ్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకృతికి వాటిల్లుతున్న నష్టంపై ఛాయాచిత్రాన్ని ప్రదర్శిస్తున్న వరప్రసాద్

242 మందికి కంటి పరీక్షలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయ కళ్యాణ మండపంలో సదావర్తి అన్నదాన సత్రం, ఎస్ఆర్ఐ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐ వైద్యులు 242 మందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. 75 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సదావర్తి అన్నదాన సత్రం ఫౌండర్ ట్రస్టీ జి. నాగేశ్వరరావు, ఉషారాణి, ఎస్ఆర్ఐ వైద్యులు పూజిత, సాగరిక, రమ్య, మౌనిక, వనిత, భాగ్య, శ్రావణి, టెక్నికల్ అసిస్టెంట్ ఫిరోజ్బేగ్, క్యాంప్ కోఆర్డినేటర్ ఎస్, సుబ్బారావు, కిషోర్బాబు, ల్యాబ్ అసిస్టెంట్స్ నాగలక్ష్మి, కె.సునీత, సిబ్బంది భవాని, సందీప్, ఎం. శంకరరెడ్డి, ప్రశాంతి, గోవింద్, చిన్నయసూరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సౌరభాలు



గీతాలు అలపిస్తున్న గాయకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మహతి స్వరసుధ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సినీ సౌరభాల కార్యక్రమం అలరించింది. గాయనీ, గాయకులు ఎం.సుఖీ, కె.అన్నపూర్ణ, ఎం.కృష్ణ, కె.ప్రద్యుమ్న, జి.వీరయ్య, వి.మధుబాబు, కె.శివప్రసాద్, డి.టి.సాయిబాబా తదితరులు సినీ, భక్తి గీతాల్ని మధురంగా అలపించారు. కీబోర్డ్పై కె.రవిబాబు, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్పై బి.ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమానికి కె.శివప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, పూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ అర్చక సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ఫిరంగిపురం: మండల బ్రాహ్మణ అర్చక సమాఖ్య మొదటి సమావేశం గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. అంతకుముందు సమాఖ్య గౌరవ అధ్యక్షుడిగా నారాయణం ప్రసాదాచార్యులు, అధ్యక్షుడిగా దీవి వర ప్రసన్నమూర్తి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ లక్ష్మీనారాయణశర్మ, కోశాధికారిగా రావూరి పూర్ణచంద్రశాస్త్రి, కార్యదర్శిగా వి.రాజేంద్రశర్మ, కమిటీ ఆగమ సలహాదారులుగా సీహెచ్ భరద్వాజాచార్యులు, గడియారం అయ్యన్నశాస్త్రి, సలహాదారులుగా ఎస్. హనుమంతాచార్యులు, కమిటీ సభ్యులుగా కె. సత్యనారాయణాచార్యులు, ఎం. వెంకట సత్య నరసింహారావు, పి.శ్రీనివాసాచార్యులు, ఇ. మల్లేశ్వర శర్మ, డి. విశ్వనాథశాస్త్రి, కె. ప్రసన్నాంజనేయ శర్మలను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సమాఖ్య నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.



ఎన్నికైన సభ్యులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com